# బాలగోపాల్



# పొరకల దొర కథ

**1981** ఏప్రిల్ 20వ తేదీన ఇంద్రవెల్లిలో కాల్పులు జరిగినప్పుడు పత్రికలన్నీ ఆదిలాబాద్ గిరిజనుల గురించి అనేక విషయాలు రాశాయి. అప్పుడు ఒక పేరు బాగా ప్రచారంలోకి వచ్చింది. అది 'పొరకల దొర' అనే పేరు. ఆ వ్యక్తి అసలు పేరు దాసరి లక్ష్మీకాంతం. వరంగల్ వాస్తవ్యుడు. జీవనం కోసం ఆదిలాబాద్‌లో పొగాకు అమ్ముకునే వాడు. పొగాకు అమ్ముతూ గిరిజన ప్రాంతాలలో తిరిగే వాడు. అతని లాగ దేశంలోని గిరిజన ప్రాంతాలలో పొగాకు, మిల్లు బట్టలు మొదలయిన నాగరిక ఉత్పత్తులు అమ్ముతూ తిరిగే వర్తకులు ఎందరో ఉండేవారు, ఇప్పటికీ ఉన్నారు. చవకబారు సరుకుకు చాలా ఎక్కువ ఖరీదు చెప్పి గిరిజనుల నుండి రొక్కం రూపంలోనూ వస్తు రూపంలోనూ అధిక ధర సేకరించి, త్వరలోనే ధనవంతులయిన వారు చాలా మంది వున్నారు. సంపాదించిన డబ్బుతో మళ్లీ గిరిజనుల నుండే కారుచవగ్గా భూమి కొనుక్కొని అక్కడే స్థిరపడ్డ వారూ ఉన్నారు. ఆ తరువాత కూడ గిరిజనులను వర్తకం ద్వారా, వడ్డీ వ్యాపారం ద్వారా మోసం చేయడం కొనసాగిస్తూ చాలా ఎదిగిన వాళ్లున్నారు. కొందరు ఆస్తి సంపాదనతో సంతృప్తి చెందితే మరి కొందరు రాజకీయాలలోకి దిగి గ్రామ సర్పంచ్ నుండి ఎంఎల్ఎ దాకా పదవులు నిర్వహిస్తున్నారు. ఇవ్వాళ ఆదిలాబాద్ జిల్లాలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల గానూ శాసన సభ్యుల గానూ చెలామణి అవుతున్న వారి గతాన్ని తవ్వి తీస్తే ఏమేం కథలు కనబడుతాయో!

దాసరి లక్ష్మీకాంతం ఈ మార్గంలో సులభంగా ప్రయాణం చేసి ఉండవచ్చును. భూస్వామి గానో వ్యాపారస్తుడి గానో అదిలాబాద్‌లో స్థిరపడి ఉండవచ్చును. కాంగ్రెస్ నాయకుడు తెలుగుదేశం నాయకుడు అయి వుండవచ్చును. కానీ అతను ఆ మార్గాన పోదలచుకో లేదు. గిరిజనుల ను దోచుకొని తాను బాగుపడే బదులు వాళ్లకు దొపిడీని గురించి విడమరచి చెప్పేవాడు. వాళ్ల శ్రమ విలువ ఏమిటో వాళ్ల భూమి విలువ ఏమిటో వాళ్లు అడవి నుండి సేకరించి తెచ్చే సరుకు విలువ ఏమిటో చెప్పేవాడు. వాళ్ల కష్టాలు తెలుసుకొని బయటి ప్రపంచానికి చెప్పే వాడు. అతనంటే గిరిజనులకు గురి ఏర్పడింది. తాము నమ్మిన నాయకుల గురించి ఆనవాయితీగా చెప్పుకునే అభూత కల్పనలు అతని గురించి కూడ చెప్పుకునే వారు. లక్ష్మీకాంతం 'పొరకల దొర' అయ్యాడు. అటు నుండి 'నక్సలైట్' అయ్యాడు. ఒక పార్టీ నుండి మరొక పార్టీకి పోయాడు. అరెస్టయి జైలుకు పోయాడు. నాలుగు సంవత్సరాల కాలంలో భారత న్యాయ వ్యవస్థలోని అన్యాయాన్నంతా రుచి చూశాడు.

అతను మొదట అరెస్టయింది 1984 నవంబర్ 16వ తేదీన. అసిఫాబాద్ కోర్టులో రకరకాల కేసులు పెట్టారు. 1987 జనవరి నాటికి ఆ కేసులన్నీ కొట్టుకు పోయాయి. ఇక బయటికి వచ్చేస్తాడనగా పోలీసులు మరొక కేసు తవ్వి తీసి మళ్లీ రిమాండు చేయించారు. దీనిని కూడ 1987 ఫిబ్రవరి 25న అసిఫాబాద్ కోర్టు కొట్టివేసి కోర్టు నుండే విడుదల చేసింది. అయితే పోలీసులు కోర్టు బయటే కాపు గాసి మళ్లీ పట్టుకొని సిర్పూర్ పోలీస్ స్టేషన్‌లో 33 రోజులు అక్రమ నిర్బంధంలో వుంచారు. మార్చి 28వ తేదీన మళ్లీ సిర్పూర్ కోర్టులో హాజరు పరచి, 'నాటు తుపాకీ చేతిలో పట్టుకొని హత్య చేయడానికి సమాయత్తమవుతుండగా నిన్నటి దినం అరెస్టు చేశాము' అని చెప్పి టెర్రరిస్టు చట్టం కింద కేసు పెట్టారు. ఈ కేసు విచారణ ప్రారంభం కావడానికి దాదాపు రెండేళ్లు పట్టింది. విచారణ 1989 ఫిబ్రవరి 6వ తేదీన ముగిసింది. అదిలాబాద్ డెజిగ్నేటెడ్ జడ్జి 'పొరకల దొర'కు అయిదేళ్లు కఠిన కారాగార శిక్ష విధించాడు. గిరిజనులను దోచుకొని ఆస్తులు సంపాదించుకునే సదవకాశాన్ని వదులుకొని 'న్యాయానికి పోయినందుకు' దాసరి లక్ష్మీకాంతంకు మన న్యాయవ్యవస్థ ఇచ్చిన ప్రతిఫలం ఇది!

లక్ష్మీకాంతం లాంటి వాళ్లు చాలా అరుదు. తక్కిన వాళ్లు నైతికమయిన ఆవేదన ఎంత మాత్రం లేకుండ భూమీ ఆస్తి సంపాదించుకున్నారు. వాళ్లను అడ్డుకో గలిగినవి రెండు మాత్రమే. గిరిజనులలో చైతన్యం పెరిగే కొద్దీ వాళ్లను దోచుకోవడం కష్టం అవుతుంది. (యాభయి ఏళ్ల క్రితం దోచుకున్నంత సులభంగా ఇవ్వాళ దోచుకో లేకుండ వున్నారు). రెండవది, తాము సంపాదించుకున్న భూమిని తిరిగి గిరిజనులకు ఇప్పించే పరిస్థితి ఏర్పడితే మొదటికే మోసం వస్తుంది. బలవంతంగా ఇప్పించే రోజులు ఇంకా ఇప్పటి దాకా రాలేదని వాళ్లకు తెలుసును. ఆరోజు వస్తే చేయగలిగింది ఏమీ లేదని కూడా తెలుసును. అయితే ఆ లోపల భూమి బదలాయింపు నియంత్రణ చట్టాలను అమలు చేస్తానంటూ ఏ కలెక్టరయినా పూనుకుంటే భూమి పోకపోవచ్చును గానీ చాలా న్యూసెన్సు అవుతుంది (కోర్టు కేసులూ లంచాలూ ఫీజులూ...). అటువంటి కలెక్టర్ దాపురిస్తే అతని మీద అపనిందలు వేసి తమ తమ పార్టీల నాయకులకు చెప్పి బదిలీ చేయించుకోవాలి. కొన్ని నెలల క్రితం అదిలాబాద్ జిల్లాలో ఇదే జరిగింది.

గిరిజనేతరులు — అంటే మనబోటి మైదాన ప్రాంతాల వాళ్లు— ఇవ్వాళ అదిలాబాద్‌లో 83 శాతం ఉన్నారు. ఒక శతాబ్దం క్రితం దాదాపు పూర్తిగా గిరిజన ప్రాంతంగా ఉన్న జిల్లాలో ఇవ్వాళ గిరిజనులు కేవలం 17 శాతం ఉన్నారంటే, గిరిజనేతరుల ప్రవాహం ఎంతగా ఉన్నదీ అర్థం అవుతుంది. వీరిలో కొందరు నిజాం నవాబు వేలం వేయగా వందల ఎకరాల భూమిని కొనుక్కొని అక్కడ స్థిరపడ్డా

రు. కొందరు ఈ భూస్వాముల భూములను సాగు చేయడానికి రైతులగానో పాలేర్లగానో అక్కడికి పోయి, త్వరలో తామూ నాలుగయిదు ఎకరాలు సంపాదించి స్థిరపడ్డారు. కొందరు రకరకాల వ్యాపారాల కోసం పోయి గిరిజనులను మోసగించి ఆస్తులు సంపాదించుకున్నారు. కొందరు రెవెన్యూ అధికారులకూ అటవీ శాఖ అధికార్లకూ గ్రామాలలోని పట్వారీలకూ లంచాలు మేపి గిరిజనుల భూములనూ అడవి భూములనూ తమ పేరిట పట్టా చేయించుకున్నారు.

మైదాన ప్రాంతాల వారు ఈ రకంగా 'దాడి'కి పూనుకుంటే గిరిజనులకు రెండే ప్రత్యామ్నాయాలున్నాయి. ఒకటి, వారిని ప్రతిఘటించడం; రెండవది, వారి బారిన పడ్డ భూములను వదిలి పెట్టి అడవులలోకి పోయి కొత్తగా భూమిని సేద్యంలోకి తేవడం. ఈ రెండు పనులూ గిరిజనులు చేస్తూనే వున్నారు. ఈ రెండిటి చిహ్నాలూ మనకు చరిత్ర నిండా కనబడుతాయి. అయితే ఆధునిక కాలం వచ్చి అడవుల ఆర్థిక ప్రాముఖ్యం పెరిగిన తరువాత ఇది కష్టం అయిపోయింది. ఆధునిక నాగరికత పెరిగే కొద్దీ గృహ నిర్మాణం పెరుగుతుంది. ఇంటి దూలాలకూ స్తంభాలకూ తలుపు చెక్కలకూ కుర్చీలకూ, బల్లలకూ బీరువాలకూ కలప కావాలి. ఇందులో మానవ జీవితానికి అవసరం అయింది కొంత అయితే ధనవంతుల ఆర్భాటమయిన జీవన సరళి కోసం వృథా అయ్యేది చాలా ఎక్కువ. దీనితో బాటు కలపకు ఉండే పారిశ్రామిక ప్రాముఖ్యం కూడ పెరుగుతుంది. కాగితపు గుజ్జు కోసం కలప కావాలి, రేయాన్ వంటి కృత్రిమ నూలు ఉత్పత్తికి కలప కావాలి, రైల్వే స్లీపర్లకు కలప కావాలి, నౌకా నిర్మాణానికి కావాలి — అంటే బడా పరిశ్రమకు కూడ కలప చాలా అవసరం. దీనికి తోడు అడవులలో అనేక రకాల ఖనిజాలు దొరుకుతాయి. ఇనుము, బొగ్గు, సున్నపు రాయి, అడవులలో దొరికే ప్రధానమయిన ముడి సరుకులు. వీటి తవ్వకం గూడ బడా పరిశ్రమకు అవసరం. అసలు అదే ఒక బడా పరిశ్రమ.

ఆధునిక కాలంలో ఉత్పన్నమయిన ఈ అవసరాల వల్ల అడవుల మీద నాగరికుల దాడి మరీ ఎక్కువ అయింది. పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అడవులను 'రక్షిత వనాల'గా ప్రకటించడం మొదలు పెట్టింది. అక్కడ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో నాగరిక జీవితానికీ పరిశ్రమలకూ అవసరమయిన టేకు, యూకలిప్టస్ వంటి కలప రకాలను పెంచడం మొదలయింది. దీని వలన గిరిజనులకు కొత్తగా అడవి భూములను సేద్యంలోకి తేవడం అసాధ్యం అయింది. ఒక వైపు గిరిజనేతరుల భూ ఆక్రమణ అయితే మరొక వైపు 'రక్షిత వనాలు' అనే ఈ నిర్బంధం — వీటితో గిరిజనుల పరిస్థితి 'అడకత్తెరలో పోకచెక్క' అన్నట్టు తయారయింది.

దీని ఫలితంగా ఆధునిక కాలంలో గిరిజనుల ప్రతిఘటన కూడ పెరిగింది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అసంఖ్యాకమయిన గిరిజన పోరాటాలు జరిగాయి. తిరుగుబాట్లు వచ్చినప్పుడల్లా ప్రభుత్వం పోలీసులనూ ఇతర సాయుధ బలగాలనూ వినియోగించి వాటిని పాశవికంగా అణచివేస్తూ, అణచివేత అయిపోగానే గిరిజనుల సంక్షేమం కోసమని చెప్పి భూమి బదలాయింపు నియంత్రణ చట్టాలను జారీ చేస్తూ వచ్చింది. గిరిజనుల భూములను మైదాన ప్రాంతాల వాళ్లు కాజేయకుండ చూడడం ఈ చట్టాల లక్ష్యం. మన రాష్ట్రంలో 1915–16 సంవత్సరాలలో మన్యం ప్రాంతంలో వచ్చిన గిరిజన తిరుగుబాటును అణచివేసిన తరువాతే మొట్టమొదటి షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు మరియు వడ్డీ వ్యాపార నియంత్రణ చట్టం (1917) వచ్చింది. ఇది అప్పటి బ్రిటిష్ పాలిత ప్రాంతమయిన కోస్తా రాయలసీమ జిల్లాలకు వర్తించే చట్టం. నిజాం పాలనలో వున్న తెలంగాణాలో అప్పటి దాకా గిరిజన పోరాటాలూ లేవు, గిరిజన సంక్షేమ చట్టాలూ లేవు. 1940లో అదిలాబాద్ జిల్లాలోని అసిఫాబాద్ ప్రాంతంలో కొమురం భీము నాయకత్వంలో పోరాటం వచ్చిన తరువాత నిజాం సంస్థానానికి వర్తించే భూమి బదలాయింపు నియంత్రణ చట్టం 1946లో వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత 1959లో ఈ రెండింటినీ క్రోడీకరించి ఆం.ప్ర. షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు నియంత్రణ చట్టాన్ని చేశారు. అయితే అప్పటికి గిరిజన ప్రాంతాలలో సంఘటిత ఉద్యమాలేవీ లేవు కాబట్టి 10 సంవత్సరాల పాటు ఈ చట్టం అమలుకు కావలసిన నియమాలను రూపొందించ లేదు. 1968లో శ్రీకాకుళ గిరిజన పోరాటం వచ్చిన తరువాతే — ఒకవైపు దానిని 'ఎన్‌కౌంటర్ల'తో అణచి వేస్తూనే — 1959 చట్టానికి రూల్సు తయారు చేశారు. అదే సమయంలో దానిని మరింత పటిష్టం చేస్తూ 1970 రెగ్యులేషన్ వచ్చింది. 1971లోనే ఆ రెగ్యులేషన్ కోర్టుకెక్కింది. 18 సంవత్సరాలు కోర్టులో గడిపి విజయవంతంగా బయటికి వచ్చిన తరువాత ఇప్పుడు ప్రభుత్వమే దానిని రద్దు చేయాలని నిర్ణయించుకుంది!

ఈ నిర్ణయాన్ని ఇవాళ ఏ పేరు పెట్టి సమర్థించుకున్నా ఒకటి మాత్రం వాస్తవం. 1917 నుండి అమలులో ఉన్న చట్టాలను వాస్తవంలో అమలు చేసింది చాలా తక్కువ. అమలు చేస్తామన్న బెదిరింపుతో రెవిన్యూ అధికారులు గిరిజనేతరుల నుండి లక్షల రూపాయల లంచాలు తిన్నారు. అమలు చేయిస్తామన్న ఆశ గిరిజనులకు చూపి నానా రకాల పైరవీకారులూ రాజకీయ నాయకులూ డబ్బులు తిన్నారు. అమలు చేసింది మాత్రం బహు స్వల్పంగా. ఇవ్వాళ రాష్ట్రంలోని షెడ్యూల్డు ప్రాంతాలలో గిరిజనేతరుల జనాభా దాదాపు 50 శాతం చేరుకుంది. వాళ్ల పట్టాలో వున్న సేద్యపు భూమి దాదాపు 56 శాతం (8.7 లక్షల ఎకరాలు). పట్టా లేకుండ వాళ్ల ఆక్రమణలో వున్న భూమినీ, వాళ్లు గిరిజనుల నుండి కౌలుకు తీసుకొని నిక్షేపంగా అనుభవిస్తున్న భూమినీ కూడ లెక్కబెడితే ఇది ఎంత అవుతుందో! ఇందులో కేవలం 80 వేల ఎకరాలను మాత్రమే (అంటే 9 శాతం మాత్రమే) ప్రభుత్వం భూమి బదలాయింపు నియంత్రణ చట్టాల కింద గిరిజనులకు ఇప్పించ గలిగింది.

ఇది మన రాష్ట్రం కథ మాత్రమే కాదు, దేశంలో అన్ని రాష్ట్రాల కథ ఇదే. అందుకే దేశ వ్యాప్తంగా ఇవ్వాళ గిరిజనులు అలజడి చేస్తున్నారు. తమకు ఎవ్వరు సానుభూతి చూపితే వాళ్లకు మద్దతు ఇస్తున్నారు. బీహార్ — మధ్యప్రదేశ్ — ఒరిస్సా రాష్ట్రాలలోని జార్ఖండ్ ఉద్యమం, మన రాష్ట్రంలోని నక్సలైట్ ఉద్యమం, కొన్ని రాష్ట్రాలలో అడవుల సంరక్షణ ఉద్యమం, ఈ కారణాల వల్లనే గిరిజనులను ఆకర్షిస్తున్నాయి. ఈ ఉద్యమాల రాజకీయ స్వభావంలోనూ అవగాహనలోనూ ఎన్ని తేడాలున్నా, ఇవన్నీ కూడ గిరిజనులకు రెండు వైపుల నుండి మైదాన ప్రాంతాల గిరిజనేతరుల నుండి, ప్రభుత్వ అటవీ విధానం నుండి — వస్తూన్న దాడిని ఎదుర్కోవడంలో సాయం చేస్తున్నాయి కాబట్టే ఇవి గిరిజనుల మద్దతు పొందగలుగుతున్నాయి. మన రాష్ట్రంలో ప్రభుత్వం గిరిజనులకు చట్టాల కింద ఇప్పించిన భూమి 80 వేల ఎకరాలుంటే, గిరిజనులు నక్సలైట్ల మద్దతుతోనూ ఇతరత్రానూ సాగు చేసుకుంటున్న అడవి భూమి 1 లక్ష ఎకరాలకు పైగా వుందన్నది ప్రభుత్వం అంచనాయే!. దీనికి ప్రతిఫలంగా ప్రభుత్వం నుండి గిరిజనులు — అన్ని రాష్ట్రాలలోనూ — తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొవలసి వస్తోంది. ఇంద్రవెల్లి కాల్పులు మూకుమ్మడి కాల్పులు కాగా, ఈ మధ్యకాలంలో అదిలాబాద్‌లో గిరిజన యువకులను ఇళ్ల నుండి తీసుకుపోయి కాల్చిపారేసి 'ఎన్‌కౌంటర్' అని ప్రకటించడం మామూలయి పోయింది.

భూమి బదలాయింపు నియంత్రణ చట్టాల వలన షెడ్యూల్డు ప్రాంతాలలోని సామాన్య గిరిజనేతర రైతాంగం ఇబ్బందులకు గురి అవుతున్నారని ఒక వాదన ఉంది. అది నిజమే. అవినీతికీ అలక్ష్యానికీ ఆలవాలమయిన అధికార యంత్రాంగం ఈ చట్టాలను తన స్వలాభం కోసం వినియోగించుకుంటూ వుంది. అయితే అందుకోసం ఆ చట్టాలనే రద్దు చేయాలనడంలో అర్థం లేదు. భూమి బదలాయింపు నియంత్రణ చట్టాలతో బాటు భూ సంస్కరణ చట్టాలనూ కనీస వేతన చట్టాలనూ కౌలుదారీ సంరక్షణ చట్టాలనూ కూడ సక్రమంగా అమలు చేసి, ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక అనుకూల అటవీ విధానం కాకుండ గిరిజన అనుకూల అటవీ విధానాన్ని అవలంబిస్తేనే గిరిజనుల సమస్య, దానితోబాటు గిరిజనేతర సామాన్య రైతాంగం సమస్యా కూడా పరిష్కారం అవుతాయి. అటువంటి వ్యూహంగానీ పథకంగానీ లేని ప్రభుత్వం ఒకరి పేరు చెప్పి ఒకరి పొట్ట కొడుతూంటే సమర్థించడమయినా చూసి ఊరుకోవడమయినా ప్రజలకు ద్రోహం అవుతుంది.